# సుకుమారులు

ఆమె పేరు కోమలి, అతని పేరు సుకుమార్. ఇద్దరికీ పెళ్ళై మూడు సంవత్సరాలవుతుంది. ఇద్దరూ ఒకే ఎత్తు ఉంటారు. వయస్సు కూడ ఒక్కటే. ఇద్దరూ అందమైనవాళ్ళే. ఇద్దరూ బి. ఎ. ప్యాసయ్యారు. అయితే ఇద్దరూ ఒకే ఆఫీసులో మాత్రం పని చేయడంలేదు. ఆమె ఇంటినే ఆఫీసు చేసుకుంది. దానికి యజమానురాలైంది. అతను ఓ ఆఫీసుకు మేనేజరు.

వీరి దాంపత్య జీవితం గురించి ఎవ్వరికీ ఏమీ తెలియదు. ఆ వీధిలోని వారు చాలమంది వారి రహస్యాలను తెలుసుకోవాలని ఎంతో ఎంతో కృషి చేశారు. ఎన్నో ఎన్నో వ్యూహాలు పన్నారు. కాని ఏమీ తెలిసిరాలేదు. తెలిసిందల్లా వారిద్దరికీ ఉన్నంత అన్యోన్యత ఈ ప్రపంచంలో మరెవ్వరికీ ఉండదనే... ఇంత మాత్రమే తెలిసింది. ఇది నిజంగా వారికి ఆశాభంగమయింది. అన్యోన్యంగా ఉండటంలో ఏం గొప్ప ఉందని చాలమంది ఈసడించారు. పైకి కనబడని వాళ్ళ గుండెల్లో తప్పక ఏవేవో కల్లోలాలు ఉండనే ఉంటాయని కొందరు తృప్తిపడ్డారు. కల్లోలాలు లేకుండా సంసారా

లుండటం అలాంటి కుటుంబాలు అసలు ఉంటాయని ఆలో చించడం ఇత్యాదులు శుద్ధ తెలివితక్కువ ఆలోచనలని వారి వారి మనస్సుల్లోని పరిశుభ్రమైన అభిప్రాయాలు మరి! పాపం అటువంటి వాటిని వారెట్లా త్రోసిపుచ్చగలరు? అయితే కొందరీ అభిప్రాయాలతో తృప్తిపడి సుఖంగా నిద్ర పోలేదు. అన్యోన్యత అనేది ఎట్లా ఉంటుందో కూడ పరీక్షించి తెలుసుకోవాలిగా...

ఎవరి మట్టుకు వారే ఆ వీధిలోనివారు ఈ విధంగా అను కోవడం వల్ల ప్రతి ఒక్కనికీ ఈ విషయమై కూపీలు తీయ డానికి కావలసిన సహకారం లభ్యం కాలేదు. ఏమిటో మనస్సుల్లో అనుకొని ఊరుకోవడం వల్ల ఏమి లాభం ఉంటుంది? తమలో ఉన్నది అందరికీ చెప్పి తమ అభిప్రాయాల కభిముఖంగా త్రిప్పుకొని, కలసి కట్టుగా పనిచేస్తేనేగాని ఏ వ్యవహారానికి ఓ దారనేది ఏర్పడదు. అయితే ఈ విధంగా కలవడమనేది సంసారులుగా ఉంటూన్న వారి విషయంలో ... చ్చితంగా జరిగే పనిగాదు. ఒకరు ఇలా అంటే మరొకరు అలా ఉంటారు. వారి మనస్సుల్లో ఉన్నది వారికన్న ముందు వారికే—మరొకరు వచ్చి వినిపించడం వారు సహించలేరు. అలా సహించగలిగే వాళ్ళున్నా వారు ఎదుటి వానితో పూర్తిగా ఏకీభవించరు. ఈ ఈ కారణాలవల్ల ఎవరికి వారే, ఆ కుటుంబం గురించి ఆలోచిస్తూ, ఆ కుటుంబాన్ని శుభ

ప్రదంగా నడుపుతూన్న అతి రహస్యమైన జీవనపద్ధతి ఏమి టని, ఖాళీగా ఉన్నప్పుడల్లా తమ తమ ఊహలను చిదగ్గొట్టు కుంటూ, తమకు వెంటనే ఆ సత్యాన్ని తెలియజేయమని, భయంకరంగా పసివాడి ముందు బెత్తం మాష్టారులా తమ తమ మనసుల ముందు అరుస్తున్నారు! కాని ఫలితం ఏడుపు మొగం తప్పించి ఏమీ ఉండడం లేదు.

ఊరుకోక ఒక పెద్దమనిషి ఆ జంటదగ్గర దాసీగా పని చేస్తూన్న చిట్టిని బజారులో—ఓకేచోట తనూ ఆ పిల్లా కలిసి కూరగాయలు కొంటూన్నప్పుడు మెల్లిగా పలుక రించాడు. మొదట సంభాషణ ఎలా ప్రారంభించాలో అతనికి తోచలేదు. కాని అప్పుడే ఆ పిల్లతో మాట్లాడక ముందే - ఆ కుటుంబం బాపతు రహస్యాలన్నీ తనకు తెలిసిపోయి నట్లు ఉబ్బిపోయాడు. అతని కళ్ళచుట్టూ, ఆ వీధిలోని వారం దరూ ఈ తీయని రహస్యాల బెల్లపచ్చుల మీదికి ఈగల్లా ముసిరినట్లు ఊహించేశాడు. ఉక్కిరి బిక్కిరైపోయాడు. మాటరాక, గొంతుక పెగలక, దిక్కులుచూడటం మొదలు పెట్టాడు. ఈ లోగా చిట్టి ఓ దిక్కుగా వెంచేయడం మొదలు పెట్టింది. ఇదిచూచి 'అరరే...' అనుకొని, ఊహలను నరు క్కొని, గొంతుక సవరించుకొని, 'ఇదిగో చిట్టీ...' అన్నాడు.

'ఏమండీ...' అంది చిట్టి.

'ఏమిటి కొన్నావ్...' అన్నాడా పెద్ద మనిషి.

'ఇప్పుడు మీరు చూస్తూనే ఉన్నారు కదండీ...' అంది చిట్టి.

దాసీదానికి కూడ తెలివి ఉండడం భరించలేని ఆ పెద్ద మనిషి, 'అది తెలుసులే...' అన్నాడు.

చిట్టి బిత్తరపు చూపులు చూసింది. తమరు ఏం చెపుతున్నారో నా కర్థం కావాలి కదండీ అన్న భావాన్ని ఆమె కళ్ళు ప్రకటించాయి.

పాడు సినిమాలొచ్చి, ఇప్పుడు దాసీవాళ్ళు కూడ నటీమణులై పోతున్నారు. ఖర్మ, అనుకొని అతను, 'అది కాదు చిట్టీ...' అన్నాడు. దీనికి అర్థం అసలే లేదు. కాని, పద...' చెప్తాను అంటూ, చిట్టితో నాలుగడుగులేసి అతను ఒకసారి వెనుకా ముందూ చూశాడు. 'ఏమిటీ మనిషి...' అనుకుంది చిట్టి.

అప్పుడే అతను, 'సంచి చాల బరువుగా ఉంది...' మెల్లిగా తనలో తా ననుకున్నట్లు అన్నాడు.

వెంటనే చిట్టి, 'పోనీ నా కియ్యండి బాబూ నేను తెస్తాను...' అంది అతని వాలకానికి లోలోన నవ్వుకుంది.

అతను మనసులో ఇక ఫరవాలేదు అనుకున్నాడు. సంచిని చిట్టిచేతి కిచ్చేసి, అయితే చిట్టీ శారొస్తోంది ఇలా ప్రక్కగా తప్పుకో...అబ్బబ్బ వెధవది కార్లుకూడ బజార్లోనే తిరుగు

తాయి...అవునుగాని, మీ సుకుమార్ గారు నిన్ను బాగా చూస్తారా...' అన్నాడు.

వెంటనే చిట్టి 'ఆరంత మంచోరు లేనేలేరు బాబు. నెల జీతం పట్టుతారీఖునే ఇచ్చేస్తారు...ఎప్పుడూ తిప్పరు...' అంది.

ఆ మనిషికి మా చెడ్డ చిరాకేసింది. 'వాళ్ళ మంచితనం నిన్నెవ్వరు చెప్పమన్నారు' అని చిట్టిని మనసులోనే నాలుగు తిట్టుకొని, 'ఆ సైకిలువాడు చూడు ఎలా రాసుకు పోతున్నాడో... వెధవకి బుద్ధీ జ్ఞానం లేదు. అదికాదు చిట్టీ...నా ఉద్దేశం. నీ జీతం సంగతికాదు...' అని అతను ఆగిపోయాడు.

'అయితే మరేమిటండీ...' అంది చిట్టి.

అతను మెల్లిగా పొడుం ముక్కు రుద్దుకొని ఒకసారి చీది. 'ఈ సందులోంచి పోదాం రా...వెధవ బజారు. నాకసలే బజారులో మాట్లాడటం అంటే భయం.' అంటూ నడక ప్రక్కసందులోకి మళ్ళించి, 'జీతం సంగతికాదు చిట్టీ... పండక్కీ పబ్బానికి నీకేమైనా చీరా...అది...ఏమిటి... పెట్టడం అనేది ఏమైనా ఉందా అని...అంతేగాని జీతం ఇంతని మాట్లాడుకున్న తరువాత ఇవ్వకేం చేస్తారూ...' అన్నాడు.

వెంటనే చిట్టి, 'ఇస్తారు బాబుగారు... మొన్న దీపావళికి అమ్మగారు ఎంచక్కటి చీర ఇచ్చారు. పెద్ద పండక్కి కూడ అమ్మగారు మరోటిస్తా నన్నారు' అంది.

వినసొంపుగా లేని ఈ విషయాలు ఆ పెద్దమనిషి తలను ఖరాబుచేసి పారేశాయి. వెంటనే ఏదో ఆలోచన తట్టినట్లు కళ్ళు మెరిపించి, 'సుకుమార్ గారికి ఆవిడ తెలిసే ఇచ్చిందా... తెలిస్తే సుకుమార్ ఇవ్వనిస్తాడనుకోను. ఏమిటో అతని తరహా నాకేం నచ్చదు...' అన్నాడు; మెల్లిగా పుల్ల విరుపుగా.

ఈ మాట విన్న వెంటనే చిట్టి ఎంతో బాధపడిపోయిన దానిలా మొగంపెట్టి, 'అదేమిటండి బాబుగారు......అలా అంటారు. ఆరు అలాంటోరు గారండి. ఆరిద్దరూ ఒక్కటే! ఒక్కోసారి ఆరిద్దరి మాటలకూ తేడాయే తెలియదు' అంది.

ఆ పెద్దమనిషి ఒక్కసారి నివ్వెరపోయాడు. 'ఏమిటీ... వారిద్దరికీ తేడా ఉండదూ...అంటే?' అన్నాడు.

'అంటే ఏమిటో నేను చెప్పలేనండి. ఏమిటో ఆరు ఏమి చేస్తున్నా, ఏమి మాట్లాడుకుంటూన్నా నాకు ఒక్కలాగే అనతాది. ఎవరో సూడలేక ఆరిని ఇద్దరిగా చీరేసారా అని పిస్తాది...' అంది.

అప్పుడే ఆ పెద్దమనిషి చిట్టి మొగంలోకి చూశాడు. ఆ సమయంలో చిట్టి మొగంలోంచి వచ్చిన మాటలకు

రూపంగా అసుందర భావం ఆమె మొగంలో దేదీప్యంగా వెలిగిపోతోంది. ఇక ఆ పెద్దమనిషి చిట్టి నడిగి లాభంలేదను కున్నాడు. 'అంత చక్కటి దాంపత్యమన్న మాట!' అని ఈర్ష్యగాకూడ అనలేకపోయాడు. సంచితీసుకొని, 'నాకు పనఉంది. ఇలా వెళ్ళివస్తాను' అంటూ మరోదారిని వెళ్ళి పోయాడు.

కోమలి పెద్దఇంటి పిల్ల. సుకుమారూ అంతే. సుకుమార్ సద్గుణాలపోగు. కోమలీ అంతే. కోమలి వెన్నెల. సుకుమార్ అందులోని చల్లదనం! కోమలి వెన్నపూస. సుకుమార్ అందు లోని మాధుర్యం! కోమలి చల్లని నదీమ తల్లి. సుకుమార్ అందులోని ప్రవాహగుణం! కోమలీ సుకుమారులు ఒకే ఒక్క జీవకణం యొక్క రెండు పొరలు!

కోమలి నిద్రపోదు. సుకుమార్‌కు నిద్రరాదు. కోమలి ఒళ్ళు విరుస్తుంది. సుకుమార్ పుస్తకం మూస్తాడు. సుకు మార్ వీధిలోనికి వెళ్ళడాని కిష్టపడడు. కోమలి, సుకుమార్‌ను విడిచి ఉండటం భరించలేదు. ఇద్దరూ ఎదురెదురుగా కూర్చుం టారు. చూపుల్లో చూపులు కలుపుకుంటారు. నవ్వులలో నవ్వులు మేళవిస్తారు. తీయని లోకాలకు. సుదూరపు సముద్ర తీరాలకు వెళ్ళిపోతారు. అనంతంగా ఆకుపచ్చ నీడల వెద జల్లే కొబ్బరితోపుల సౌందర్యాన్ని చూస్తారు. మోహనంగా నీరెండలో మెరిసిపోయే కడలి కెరటాల పిలుపులువింటారు.

ఆ పిలుపులు, ఆ నీరెండ మెరుపులు, ఆ ఆకుపచ్చ కాంతులు, ఆ మెత్తని తీరాల సుఖమెత్తని గాలుల కౌగిలింతలు, వెన్నెలల్ని వర్షిస్తాయి. జాబిల్లి కన్నులలో కదిలే వినబడని గానం ఏదో విస్తరించి వారి లోకాలను పులకిస్తుంది. సమస్త ప్రకృతీ శతకోటి నక్షత్రాల తేజస్సుతో హర్షిస్తుంది. ఆకసమూ, కడలీ, చెట్లూ, చుక్కలూ, వెన్నెలలూ, హృదయాలు అన్నీ అన్నీ మృదువుగా పెనవేసుకుంటాయి. పూలు, సువాసనల నివాళు లర్పిస్తాయి. నీళ్ళు మోహన గాన మొలికిస్తాయి. గాలులు చల్లని వీవనలు వీస్తాయి, హృదయాలు స్పందిస్తాయి. ప్రకృతి ఆ నిశ్శబ్ద మాధుర్యంలో సుకుమారంగా ఒళ్ళు విరుచుకుంటుంది!

వాళ్ళు సుకుమారులు. అత్యంత సుందరులు. వాళ్ళీ ప్రపంచాన్ని భరించలేరు. ఊహల లోకంలో విహరిస్తూ తీయని పదాల మాధుర్యంలో బ్రతుకును పోషించుకుంటారు. కనిపించీ కనిపించని లోకాలకై కలవరపడతారు. వినిపించీ వినిపించని గానలహరులకై వివశులౌతారు. సౌందర్యారాధన పనిగా ఉత్తేజితులౌతారు. వెన్నెలలు, పూలు, చిరుగాలులు ఒకే ఒక్క రెప్పపాటున మెరిసే వారి మనస్సులలోని చిత్రాతి విచిత్ర భావాల చిత్రాలకు రంగులు, కుంచెలు, కదలికలై పరవశత్వం చెందుతాయి. అంతా మోహనంగా ఉంటుంది!

కాని కాని, ఎదుగుతూన్న ఆలోచనల నెత్తిమీద మేకులా అజ్ఞానం, చూస్తూన్న అనంత దృశ్యాల శోభకడ్డు తెరగా నిలిచి విస్తృతంగా చీల్చుకొని చూడలేని కళ్ళల్లోని అసమర్థత, దూరమైపోతూన్న ప్రకృతి గానాన్ని ఉరకలు వేసి, ఇంకా ఇంకా వినడానికి పరుగులు పెట్టలేని శ్రవణేంద్రియాల అశక్తి, పాపం వారిని పట్టి పీడిస్తోంది.

సుకుమార్ ఉద్యోగం మానేశాడు. కోమలి సంతోషించింది. కోమలి ఇంటి వ్యవహారాలను పూర్తిగా నౌకర్లకు అప్పజెప్పివేసింది. సుకుమార్ ఆనందించాడు.

కోమలి సుకుమార్ మనసును చదువుకుంటుంది. సుకుమార్ కోమలి మనస్సును తన కళ్ళముందు నిలుపుకుంటాడు. 'సినిమాకు వెళ్దామా' అనాలనుకుంటుంది కోమలి. 'ఆయన కివాళ వెళ్ళడం ఇష్టమో కాదో...ఆయన మనసులో ఏముంది ఇప్పుడు...?' అనుకుంటుంది. ఏమిసినిమా ఆడుతోందని ప్రశ్నిస్తేనో...అంటే అర్థం తెలిసిపోతుంది. అబ్బె. అలా అనగూడదు. ఇలా అనడంవల్ల ఇదేమిటి కోమలీ ఈవిషయం నాకు తెలియదూ...అని సుకుమార్ అనేయొచ్చు. పాపం ఆయనకు సినిమా చూడటం ఇష్టం లేకపోయినా... ఆ విధంగా మాట్లాడవచ్చు. ఇది వారి కెంత కష్టం కలిగిస్తుంది! అబ్బే ఈ విషయం ఎత్తగూడదు. అవును ఎత్తగూడదు.' అనుకుంటుంది కోమలి. అలా అనుకొని ఊరు

కుంటుంది. మెల్లిగా తల ఎత్తి సుకుమార్ వైపు సున్నితంగా చూస్తుంది. అలా చూసినప్పుడు తనలో ఉన్న ఏదో వాంఛ సుకుమార్ పసిగట్టేస్తాడేమోనని భయపడిపోతుంది. 'అమ్మో... ఈ భయాన్ని కూడ ఆయన గ్రహించవచ్చు!' ఈ ఊహతో కోమలి తబ్బిబ్బైపోతుంది.

అప్పుడే సుకుమార్ కోమలి వైపు చూస్తాడు. కోమలిని నేను బాధపెడుతున్నాను. నేను బాధ పెడుతున్నాను... అనుకుంటాడు. ఇప్పుడు నాకు సినిమాకు వెళ్ళాలని ఉంది. కోమలికి ఇది ఇష్టం కాకపోవొచ్చు. అందుకనే ఈ బాధ... 'కోమలీ...మనం సినిమాకు వెళ్దామా అనేస్తేనో...' అబ్బే ఇలా అనగూడదు. సినిమాలు ఈ మధ్య ఏమీ బాగుండడం లేదు అని తిరగేసి అంటే? అమ్మో...ఇంకేమైనా ఉందా... కోమలికి సినిమా చూడాలని ఉన్నా వద్దనేస్తుంది. అబ్బే ఇది లాభంలేదు. ఇలా అనగూడదు. పోనిస్తూ ఈ ప్రశ్న మానేస్తేనే మంచిది. అదిగో కోమలి నన్ను పరీక్షగా చూస్తోంది. నా మొగంలోని ఆందోళన పసిగట్టేస్తుంది. ఇప్పుడు నవ్వాలి. ఆమె చూస్తుండగా నవ్వాలి. అనుకుంటాడు. అప్పుడే కోమలీ అదేవిధంగా అనుకుంటుంది. అంతే... ఇద్దరూ ఒక్కసారే త్వర త్వరగా మారేముఖ కవళికలతో ఫకాలున నవ్వుతారు. ఇద్దరూ ఇంతవరకూ ఆలోచించిన విషయాలనన్నీ మరచిపోయి, గబాలున ఒక్కసారే తమా

షగా 'సినిమాకు వెళ్దామా ... సినిమాకు వెళ్దామా...' అంటారు, చూపుల్లో చూపులు పెనవేసుకొని.

'అద్భుతం ... అద్భుతం ... మన ఇద్దరి ఊహాలూ ఒక్కటే...' అంటాడు సుకుమార్. సరిగ్గా ఇలాగే కోమలీ అంటుంది. అంతే, ఆ రోజున ఇద్దరూ సినిమా చూస్తారు.

కోమలీ సుకుమార్‌లు అసలెప్పుడూ ఎక్కువగా మాట్లాడుకోరు. అచ్చమైన ప్రణయానికి వాక్కు లేదని వారి భావన! ప్రేయసీ ప్రియులకు చూపులే కంఠాలని వారి ఉవాచ! ఇలాంటి వారు ఏ విషయాన్నైనా విమర్శించుకుంటారా అన్నది ఊహించనలవికాని విషయం. సినిమా లోని విషయాలను సైతం వారు విమర్శించుకోలేరు. తెరమీది నాయకుణ్ణి, నాయకురాలిని చూచి వారు భయపడతారు. ఆ నాయకీ నాయకులులా తాము. త్యాగాలు చేయలేమేమో అని హడలి పోతారు. సుకుమార్ తన ప్రేయసి నెవ్వరో కిరాతకుడు ఎత్తుకపోయినట్లు ఊహించుకుంటాడు. 'అయ్యో అతని బారి నుండి మా కోమలిని ఎలా రక్షించుకోగలను? ఎలా? నేను రక్షించుకోలేను. నేనేమీ చేయలేను. నేనేమీ చేయలేను.' అని కళ్ళనీళ్ళు పెట్టుకుంటాడు. అప్పుడే కోమలి, 'ఆ నాయకురాలిలా నేను ఆ హింసలను భరించలేను. నేను భరించలేను. సుకుమార్ వచ్చే వరకు నేను బ్రతికి ఉండలేను. అయ్యో... ఎలా? ఎలా? అనుకుంటుంది. సినిమా సుఖాంతం అవుతుంది.

కాని ఈ జంట మాత్రం బాధతో ఇంటికి తరలిపోతుంది. వారి మనస్సులకీ లోకమంతా దెయ్యాలకొంపలా కనిపిస్తుంది. మండుతూన్న అగ్నిగుండంలా కనిపిస్తుంది.

ఈ మధ్య ఒక విచిత్రమైన సంఘటన జరిగింది. ఆ నాడు సుకుమార్ వీధిలోకి వెళ్తున్నాడు. ఆ వీధిలోని ఓ పెద్దమనిషి అతన్ని గబగబా కలసుకొని 'మీ దాసీ...చిట్టి ఏమి చేసిందో చూశారా...అన్నాడు. సుకుమార్ ఏమి వినవలసి వస్తుందో అని కృంగిపోయాడు. 'ఏమి చేసింది...' అని మెల్లిగా అడిగాడు.

అసలు సంగతేమిటో చెప్పకుండా ఆ పెద్దమనిషి, ముక్కుపుటాలెగరేసి, 'మీరు దాన్ని దండించాలండి...' అన్నాడు.

వెంటనే సుకుమార్, 'ఆమె మీకు అపకారంచేసినా, నాకు అపకారం తలపెట్టినా, దండించే అధికారం మాత్రం నాకు లేదండీ...' అన్నాడు. అని, ఆ సంగతేమిటో చెప్పమన్నట్టుగా అతనివైపు బాధతో చూశాడు. అంతే. ఆ పెద్దమనిషికి విపరీతమైన కోపం వచ్చేసింది. 'ఏమిటె మీరు మాట్లాడుతోంది...' అన్నాడు. పొగలు గ్రక్కుతూన్న అగ్నిపర్వతంలా.

పాపం సుకుమార్ అతని మాటల కెంతో నీరసపడిపోయాడు. మెల్లిగా, 'మీకు పుణ్యం ఉంటుంది నన్ను మీ గొడవల్లోకి ఈడ్చకండి. ఈ విషయంలో నేనేమైనా

తప్పు చేసి ఉంటే క్షమించండి...' అంటూ అక్కడనుంచి వెళ్ళిపోయాడు.

ఆ పెద్దమనిషి, 'ఏమిటీ మనిషి?' అనుకున్నాడో ఏమో... అలాగే అతనివైపు నివ్వెరపోయి చూస్తూ తన కోపాన్ని ఏమిచేసుకోవాలో తోచక కాలి బొటనవ్రేలి ద్వారా దాన్ని గట్టిగా భూమిలోనికి గ్రుచ్చి, గాలిలోకి 'థూ...వట్టి అసమర్థుడు...' అనుకుంటూ వెళ్ళిపోయాడు.

ఆనాడే చిట్టి, కోమలి ముందు ఆ పెద్దమనిషి వ్యవహార మంతా ఏకరవు పెట్టింది. భయపడుతూ, భయపడుతూ చెప్పింది. కాని కోమలి ఏమీ వినలేదు. ఆమె చెవులు వింటున్నట్లు ఉన్నా ఆమె కనులు వినడం ఎప్పుడో మానే శాయి. ఆమె ఒకే ఒక్క ముక్క, చిట్టితో అనేసి తన గదిలోకి వెళ్ళిపోయింది. 'చిట్టీ...నీకు పుణ్యముంటుంది నా దగ్గర కిలాంటి గొడవలు తేకు. నన్ను బాధపెట్టడం నీ కిష్టమా?' అంటూ.

పాపం చిట్టి ఏమిచేస్తుంది? ఇలాంటి విషయాలు అమ్మ గారికెప్పుడూ చెప్పకూడదు. ఎప్పుడూ చెప్పకూడదు...అని చెంపలు వాయించుకుంది.

ఇక ఆరోజున కోమలీ సుకుమారులు పడ్డయాతన వర్ణించలేం. ఇలాంటి ప్రపంచంలో ఎందుకు పుట్టామా......అని వారు ఆనాడంతా విలపించారు. ఈ భువిలో ఎప్పుడైనా

ఏనాడయినా ప్రణయోపాసులు, అచ్చమైన ప్రేమికులు హాయిగా బ్రతకడానికి వీలైందా అని ప్రశ్నించుకున్నారు. ఇలాంటి కిరాతకపు భూమిలో అలాంటి తపోధనులు మనడం అసంభవం...అసంభవం...వారికిక్కడ సుఖంలేదు. అసల లాంటివారు ఇక్కడ అవతరించేందుకే వీళ్ళులేవు; అని ఎంతో ఎంతో దుఃఖించారు.

వారికంటెనుండు విశ్వమంతా విషాదంగా తిరిగిపోయింది. సౌందర్యాన్ని గ్రహించేవాళ్లు, గ్రహించినవాళ్లను సహించే వాళ్లు ఈ భువిలో లేరని తపించిపోయారు.

పచ్చలు, వజ్రాలు, మరకతమాణిక్యాలు అన్నీఅన్నీ వెద జల్లిన ఆగ్రాకోటలోని విరహాలమధ్య ముష్కర పాదుషాల పాషాణాలవంటి హస్తాలలో, దీనంగా నలిగి రాలిపోయిన జగదేక సుందరులు, మలిన రాజకీయాల మునిగి సతమత మైపోయే శ్రీకృష్ణుని పాదాల సవ్వడికై పగిలిపోయినరాధ ఎదలోనిఎద, ఒకేఒక్క మధురహాసంకోసం అటమటించి పోతూన్న మొఘల్ గార్డెన్స్ లావణ్యాలు, మోహనాకారుల సందర్శన భాగ్యంకోసం మంచు ముసుగుల్లోంచి ప్రోషిత భర్తృకలా ఎదురు చూస్తూన్న కాశ్మీర్ లోయ, ప్రణయ తత్వమే ఎరుగని పాపుల పాదాల తాకిడి నిత్యం సహించ లేక బీటలువారి పోతూన్న తాజ్ మహాల్, పిక్ నిక్ పార్టీల కోలాహలంతో, జోలపాడే అమరత్వాన్ని కోల్పోతూన్న

బొటానికల్ గార్డెన్స్, నీలివెన్నెలలల మెరీనా బీచ్‌లో జోసి నోరువంటి విరహాలు——అన్నీ అన్నీ తలచుకొని, తలచుకొని, దుర్భరమైన బాధననుభవిస్తారు. ఈ బాధనువారు మరచి పోలేరు. ఈ కష్టాలను వారు భరించలేరు. సౌందర్యాన్ని గ్రహించేవాళ్లు గ్రహించినవాళ్లను సహించేవాళ్లు ఈ భువిలో లేరని తిరిగి తపించిపోతారు.

పాపం వారికిదంతా మరిచిపోడానికి కొన్ని రోజులు పడుతుంది. ఆతరువాత వారు తమ లోకాలలోకి తిరిగి ఎగిరి పోతారు. తమచుట్టూ ఏమిజరుగుతున్నదీ పూర్తిగా విస్మరిస్తారు.

ఆలోచనల విహంగం తన ఆనందాన్ని రెక్కలుగా సాచి, వారి నాకసానికి ఎగిరించుకపోతే వారట చుక్కలతో చేయీ చేయీ కలిపి నృత్యం చేస్తారు. ఓహో! అప్పటివారి ఉత్సాహమే ఉత్సాహం! ఆ మధురానుభూతుల, వారు పూవులు పూవులై వెలసి, వెన్నెలలపాయలై కరిగి, సెలయేటి తరగలై అలిసి, సువాసనలుగా, కాంతిరేఖలుగా, మధుర నిస్వనాలుగా మారి ఆ ఇసుక తిన్నెల శయనిస్తారు. చిక్కని తెల్లని పాలరాతి బొమ్మలై పోతారు! ఆ బొమ్మల, గులాబి వెన్నెలల ప్రసరించే రుధిరం ఆడుకునే విరహాలు, తుమ్మెద రెక్కలై మురిపించే కనురెప్పల తృష్ణాతీతమైన విరుపులు, కెంపులు కెంపులై పెదవులు చిందే దరహాసాల నిండిన

సుఖాల మెరుపులు, ఒహో! అవి వాక్కులకందని పరాకాష్ఠ చెందిన ఆకాశపుగుండెలోని వలపురాచరికాలు! ముప్పిరిగొన్న సృష్టిరహస్యాలు! ఒహో! ఏమి ఆనందం!

పాపం సుకుమార్ గుండెలో ఈ సుఖం తనకు శాశ్వతత్వం ఇప్పించమని కలవరపెడుతుంది. పాపం సుకుమార్ ఏమి చేయగలడు? అతను వెర్రివాడై పోతున్నాడు. పాపం కోమలీ అంతే. ఈ కల కరిగిపోతుందని ఆమె భయపడిపోతోంది. 'ఇది ఎన్నాళ్ళు...ఈ సుఖమెన్నాళ్ళు...' అన్న ప్రశ్న కాలసర్పంలా వారిని తరుముతోంది. బయట భవిష్యత్తుపొంచి ఉండి చురకత్తిలాంటి మృత్యువుతో వారిని పొడవాలని వేచి ఉంది. అయ్యో... ఈ భవిష్యత్తును వారు ఏమి చేశారు? ఎందుకు భవిష్యత్తుకు వారిపై ఇంతకోపం? వర్తమానం భవిష్యత్తుకు శత్రువా? అది కానేకాదా? మరేమిటి? వర్తమానంలో ఉండిపోయి, భవిష్యత్తు ఇక ప్రభవించగూడదని వారు వాంఛించిన విషవాంఛ ఫలితమా? అదే అదే వారిని చీల్చి చెండాడుతోందా? అయ్యో ఏమిటీ వైపరీత్యం! ఈ సుకుమారులు, ఈ పుణ్యాజీవులు, ఈ మధుమూర్తులు, చేసిన ఈ ఒక్కతప్పూ క్షమించలేవా ఓ భవిష్యత్తూ! నీవు వారిలో ప్రవేశించి వారుగా నీవు మారిపోగూడదూ? నీకు అమరత్వం సిద్ధిస్తుంది! అయ్యో ఏమిటి నీవు చెపుతున్నది. ...వారు నీకోసం తపించి నీలో కలిసిపోతే వారికి అమరత్వం

సిద్ధిస్తుందనా.. అంతశక్తి వారికున్నదా తల్లీ...వారు భయ కంపితులు, పీడితులు జరామరణ భావాల క్షయతో కృశించి పోతున్నవారు! వారికంతటి మహత్తరశక్తి ఏదీ?

ఈ క్షణంమీద మమకారాన్ని విడిచి మరొకక్షణం మీద మమకారాన్ని పెంచుకోవడం ఎంతనీచం! అంతకన్నా మహాప్రళయాన్ని ఆహ్వానిస్తానంటాడు సుకుమార్! వర్తమానం తనను విశ్వాసఘాతకుడని, కృతఘ్నుడని పిలిస్తే సహించలేడు అతను. వర్తమానాన్నీ, భవిష్యత్తునూ ప్రేమించే నటుడు కాలేడు అతను! రెండుమాటలు పలుక లేడు. రెండు నాలుకలతో బ్రతుకలేడు! ఈ సుఖాన్ని మరచి పోలేడు! ఈ సుఖాన్ని విడిచిపెట్టలేడు! ముందుకు ఒక్క అడుగు వేయలేడు! అడుగువేస్తే కలకరిగి పోతుంది! అది అతని భయం!

అనుకున్నట్టుగానే జరిగింది. ఆరోజున పెనుతుఫాను విజృంభించింది. స్వాతంత్ర్య పిపాసలా మేఘాలు సంచరిస్తున్నాయి. క్విట్ ఇండియా నినాదంలా గాలివరవళ్ళు త్రొక్కుతోంది. స్వేచ్ఛగా పుడమిని పండించడానికి వర్షం హోరున ఒకటే కుండపోతగా కురుస్తోంది. అప్పుడే భవిష్యత్తుకు రూపంలా ఎవరో ఒక వ్యక్తి తలుపు తట్టాడు. భవిష్యత్తు పిలుస్తోంది!

'తలుపు తియ్యనా...మాననా...' అని లోలోపల సుకుమార్ గిజ గిజ లాడిపోయాడు. కోమలి ఏం ముప్పు రానున్నదో అన్నట్లు గుండె లరచేత పెట్టుకొని భర్త వైపు చూసింది.

'ఎవ్వరు?' అంది.

'ఏమో...' అన్నాడు సుకుమార్.

'ఇంత వర్షంలో...' అంది కోమలి.

'ఇంత వర్షంలో మనకోసం ఎవ్వరు వస్తారు' అన్నాడు.

'గాలి చప్పుడేమో...'

'అదిగో మళ్ళీ వినిపిస్తోంది'

'తలుపు తీదామా...'

'నేను తీసి చూస్తాను'

సుకుమార్ తలుపు తీయక తప్పలేదు.

బయటనుంచి, గాలి, వర్షంతో ఉప్పెనగా చేయెత్తు మనిషి, నల్లనివాడు, గెడ్డం సంగతి మరచిపోయినవాడు, కొన తేలిన ముక్కు కిరుప్రక్కలా నిలిచిన నేత్రాలలోంచి సునిశతంగా చూసేవాడు, మహాబలిష్ఠి, రైన్ కోటు తొడుక్కొని, మిలటరీ బూట్సుతో పక పక నవ్వుతూ ప్రవేశించాడు.

కోటు విప్పి ఆ మూల గిరాటేసి, 'ఎన్నాళ్ళయిందిరా నిన్ను చూచి...' అన్నాడు.

సుకుమార్ 'పురుషోత్తం!...' అన్నాడు మామూలుగా,

వెంటనే ఆ వచ్చినతను, 'నన్ను పోల్చుకోగలిగావే... పోల్చుకోలేవేమో అనుకున్నాను. అయితే ఇప్పుడు నువ్వేమి చేస్తున్నావ్...పిల్లలా...మీ కోమలిగారేరీ... నీపెళ్ళికి రాలేకపోయాను. పేరుమాత్రం మరచిపోలేదు చూశావా... నా జ్ఞాపకశక్తి...' అంటూ ఏమేమిటో అతను బోళా బోళీగా మాట్లాడేస్తున్నాడు.

సుకుమారుకు కోమలిని అతనికి పరిచయము చేయాలని పించలేదు. కోమలి అతన్ని చూసి భయపడొచ్చు! అందులో వాడు ఏం మాయచేస్తాడో చెప్పలేం ... ఎప్పుడూ సంఘ సేవ...సంఘసేవ అంటూ అటమటించిపోతూ వుంటాడు. అని హడలిపోయాడు. కాని పరిచయం చేయక తప్పలేదు.

కోమలితో పరిచయం అయిన వెంటనే అతను, 'ఏమండీ మీరేమి చేస్తున్నారు.' అన్నాడు. ఏ మాత్రం భయం లేకుండా...ఏ మాత్రం తప్పనుకోకుండా.

కోమలి ఈ ప్రశ్న ఎప్పుడో ఒకప్పుడు ఎదురౌతుందని భయపడిపోతూనే ఉంది. ఈ ప్రశ్న ఎవ్వరో ఒకరు వేస్తారని హడలిపోతూనే ఉంది. ఈ లోకానికి ఎంత దూరంగా ఉన్నా, ఆకసాల్లోకి ఎగిరిపోతూ వున్నా...ఈ ప్రశ్న తరుముకుంటూ వస్తుందనే ఆమె భయం నిజమైపోయింది. ఆమె క్షణంపాటు నివ్వెరపోయింది. ఏమి చెప్పాలో తోచక తికమిక పడి పోయింది. ఆమె కన్నులలో ఆమె సంస్కారం నీళ్ళై

ప్రవహించడానికి బెంగపడింది. సుకుమార్ ఇది చూడలేక పోయాడు. 'ఫో...నీచుడా...నా కోమలిని, నీవు ఏడిపిస్తున్నావు' అని భయంకరంగా అరవాలనుకున్నాడు. 'నా బ్రతుకులో వ్రేలుపెట్టకు...నా పచ్చని కాపురంలో చిచ్చుపెట్టకు...నన్నిలా బ్రతకనీ...నేను నీకేమి ఎగ్గు చేశాను...నన్ను ఏడిపిస్తున్నావు...' అనాలనుకున్నాడు. కాని ఆ మాటలు, అతని గొంతకలోంచి పెగిలిరాలేదు. పురుషోత్తం తిరిగి పక పక నవ్వాడు.

'అరే ఇద్దరూ మాట్లాడరేమిటి ... బలే పిచ్చివాళ్ళలా ఉన్నారే...ఏమిటి సుకుమార్...ఏమిటి మాట్లాడవేమిటి?' అన్నాడు పక పక నవ్వుతూ.

సుకుమార్ నవ్వలేకపోయాడు, నవ్వు అతని పెదవుల్లోంచి గతంలోకి ఇంకిపోయింది. అతని చూపులు గతాన్ని చూసుకో డానికి తడువు కుంటున్నాయి. అతని మనసు జరిగిపోయిన అనుభవాల పుప్పొడిని ఏరుకోడానికి తాపత్రయపడుతోంది. భవిష్యత్తును చూడలేని అతని కళ్ళు పురుషోత్తముని చూడ లేక పోతున్నాయి. పురుషోత్తముని వినలేక పోతున్నాయి. పురుషోత్తముని సహించలేక పోతున్నాయి. కాని, కాని... ఏమి చేయగలడు?

మెల్లిగా పెదవి విప్పి, 'ఏమీ లేదు' అన్నాడు.

పురుషోత్తం సూటిగా నవ్వి, 'అంతే' అన్నాడు.

సుకుమార్ గజ గజ లాడిపోయాడు. 'ఏమీా చేయడం లేదు.' అతని చూపులు క్రిందికి వ్రాలిపోయాయి.

పురుషోత్తం మొగంలో ఒక తెర పడింది. 'అయితే మీారో...' అన్నాడు కోమలి వైపు తిరిగి.

కోమలి కాళ్ళక్రింద భూమి కదలిపోయింది. ఆమె వెక్కి వెక్కి ఏడ్చేస్తుందేమో అనుకున్నాడు, సుకుమార్...ఆమె కంఠంలోంచి మాట పెగిలి రాలేదు. 'ఏమీా చేయడం లేదండి' అంది ఎలాగన్నదో ఆమెకే తెలియదు.

వెంటనే పురుషోత్తం, 'బలేవారే ... నేను మళ్ళీ వారం పది రోజులలో వస్తాను. మిమ్మల్నిలా ఖాళీగా ఉంచకూడదు. మీాకో మంచిపని అప్పజెప్పుతాను. మరేమంత కష్టమైంది కాదులెండి. సరే నేను వస్తాను. ఇలా ఒక చోటికి పనిమీాద వెళ్తున్నాను. ఇంతలో ఇది మీా ఇల్లే అని తట్టింది. నేను గుర్తుండనేమో అనుకున్నాను. వస్తాను. వారం పది రోజులలో తప్పకుండా వస్తాను.' అంటూ కోమలి, సుకుమారుల మొగాలలోకి తిరిగి చూడకుండానే హుటా హుటిగా అడుగులు వేసుకుంటూ వెళ్ళిపోయాడు.

ఆ రోజునుంచీ కోమలీ సుకుమారుల మనసు కృశించిపోవడం మొదలు పెట్టింది. ఏడవ రోజున వారు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని కూర్చున్నారు. చీమ చిటుకుమన్నా అతను వస్తున్నట్లే హడలిపోయారు. కాని ఆనాడు అతను

రా లేదు. 'హమ్మయ్య' అనుకున్నారు వాళ్ళు. 'ఇక రాదు కోమలీ...' అన్నాడు సుకుమార్. 'ఏమో' అంది కోమలి 'అవును...వారం పది రోజులని కదూ అంట' అన్నాడు. అతను తిరిగి భయకంపితుడై పోయాడు. 'ఎలా...ఎలా' అనుకున్నాడు. అతనికి దగ్గు తెర వచ్చింది. ఆ దగ్గు నందిపుచ్చుకొని కోమలి దగ్గింది. 'కోమలీ...ఏమిటి అలా వంగిపోతున్నావేం...' అన్నాడు. 'బాధగా ఉందండీ గుండెల్లో...' అంది కోమలి. అలా అని 'అరే అదేమిటి మీరలా అయిపోయారు .. ఏమయిందిమీకు' అంది. సుకుమార్ కోమలితో మాట్లాడలేకపోయాడు. అతని కన్నులలో నీళ్ళు నిలిచాయి.

మరునాడు డాక్టరొచ్చాడు. ఇద్దరినీ పరీక్షించాడు. ఎక్సరే తీయాలన్నాడు. తీసి క్షయ...అన్నాడు. వెంటనే జాగ్రత్త తీసుకోకపోతే ప్రమాదం రావొచ్చు అన్నాడు. రాజమండ్రి కాని, మదనపల్లి కాని వెళ్ళి ఉండడం మంచిదన్నాడు.

ఒక్కసారి ఆ దంపతుల ముందు ప్రపంచమంతా గిర్రున తిరిగింది. శూన్యాన్ని చూడలేని వారి కళ్ళు జల జల నీళ్ళు రాల్చాయి.

మదనపల్లిలో వారు చెరొక పక్కమీద విశ్రాంతి తీసుకుంటున్నారు. కాని వారి మనసుకు విశ్రాంతి దొరకడం లేదు. మృత్యువుకన్న భయంగా, ఇక్కడికి కూడ ఆ పురుషోత్తం వస్తాడేమోనని వారిలో భయం పేరుకపోతోంది.

ఆ భయానికి అర్థం ఉన్నా లేకపోయినా విలువ మాత్రం ఉంది! అది వారి ప్రాణాలను మెల్లమెల్లగా చప్పరిస్తూ ఆ ప్రాణాలను తన స్వంతం చేసుకోగలుగుతోంది.

వారి దగ్గరకు నర్సు రోజూ వచ్చినట్లే మెల్లిగా నడచి వచ్చి, ఆనాడు, 'మీా కోసం ఎవరో వచ్చారండి.' అని ఆమె ఇంకా ఏమో చెప్పబోతోంది. కాని అదేమీా వినిపించుకోకుండానే వెంటనే వారు, 'ఆ...ఇక్కడకు కూడ వచ్చాడా' అన్నారు. ఇద్దరూ ఒక్కసారే ఈ మాటలు అన్నారు. వారిని ఆ స్థితిలో చూచి, నర్సు హడలిపోయింది. రతీ మన్మథులులా ఉన్న ఈ జంట గుండెల్లో భయం లేకుండా ఉంటే ఎంత బాగుండును అనుకుంది. 'మగవాళ్ళు కాదండి...చిట్టి అట...' అంది వాళ్ళను సముదాయిస్తూన్నట్లు.

కోమలి సుకుమారులలో తిరిగి ప్రాణం ఎలుకలా దాగుంది. ఫరవాలేదు. మరేం భయంలేదు. అని ఎవ్వరో బుజ్జగించినట్లు వారి మనసు స్థిమిత పడింది.

కాని ఆ రాత్రి అతను రానే వచ్చాడు. అతన్ని చూసి చూడగానే కోమలి కెవ్వున అరచింది. సుకుమార్. 'ఆ' అన్నాడు. అంతే వారి ప్రాణవాయువులు గతంలోకి వెళ్ళిపోయాయి.

పురుషోత్తం ఒక్క నిట్టూర్పు విడిచాడు. భవిష్యత్తు ఇద్దరి శక్తిని కోల్పోయిందని బాధతో కదలిపోయాడు!